సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 18 । ఫిబ్రవరి । 2024



రమణీయం.. రథోత్సవం

ఆగిరిపల్లిలో శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. 8లో ▸




కోకోలో అధిక దిగుబడి

కోకో పంటలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్త ప్రసాద్ సూచించారు. 8లో ▸

పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలోని అన్ని విభాగాలు, క్షేత్ర పరిసరాలు కిట కిటలాడాయి. సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.


8లో

ఆస్పత్రి.. నిర్మాణం జాస్తి

ప్రజారోగ్యమే పరమావధిగా భావిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆస్పత్రుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించింది. వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన సీఎం జగన్ ఆస్పత్రులకు భవన నిర్మాణాలు, వసతులు, అధునాతన వైద్య పరికరాలు, వైద్యులు, సిబ్బంది నియామకానికి కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా గత టీడీపీ హయాంలో శిలాఫలకంతో సరిపెట్టిన పాలకొల్లు ఏరియా ఆస్పత్రిని అత్యాధునిక వసతులతో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి.

పాలకొల్లులో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నిర్మాణం

- గత టీడీపీ హయాంలో శిలాఫలకంతో సరి
- జగన్ ప్రభుత్వంలో 150 పడకల నిర్మాణానికి శ్రీకారం
- మొత్తంగా రూ.16.60 కోట్లు మంజూరు
- చురుగ్గా సాగుతున్న నిర్మాణ పనులు

ఇదీ మార్పు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి.. పాలకొల్లు నియోజకవర్గంతో పాటు ఆచంట, నరసాపురం, తూర్పుగోదావరి జిల్లాలోని రాజోలు, మామిడికుదురు నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తుంది. నిత్యం ఇక్కడకు ఆయా ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యతను గుర్తించిన సీఎం జగన్ ప్రభుత్వం ఇక్కడ 100 పడకలు సరిపోవని 150 పడకల ఆస్పత్రి నిర్మాణానికి సంకల్పించింది. గత ప్రభుత్వం మాదిరిగా మాయ మాటలతో సరిపెట్టకుండా ఆస్పత్రి నిర్మాణానికి రూ.12.60 కోట్ల నాబార్డు నిధులు మంజూరు చేసింది. రెండేళ్ల క్రితం ప్రస్తుత ప్రభుత్వాస్పత్రి వెనుక భాగంలో నాగార్జున నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నూతన భవన నిర్మాణ పనులు చేపట్టారు. రెండు నెలల్లో పనులు పూర్తి కానున్నాయి. అయితే అంచనా వ్యయం పెరగడంతో పాలకొల్లు మండలం దగ్గులూరులో జరుగుతున్న వైద్య కళాశాల నిధుల నుంచి మరో రూ.4 కోట్లు మంజూరు చేసి ఏరియా ఆస్పత్రిలో మరో 100 పడకల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకున్నారు.



పాలకొల్లులో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణం



ఆస్పత్రి వెనుక 50 పడకల భవనం పనులు

నాడు ప్రచారార్భాటం

2015లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పాలకొల్లు నియోజకవర్గం యలమంచిలి మండలంలో పర్యటించి పాలకొల్లులో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. 2019 ఫిబ్రవరి నాటికి నాలుగేళ్లు గడుస్తున్నా ఎలాంటి పనులు చేపట్టలేదు. 2019లో ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ప్రజలను నమ్మించేందుకు 100 పడకల ఆస్పత్రి నిర్మాణం చేస్తున్నామంటూ ఓ శిలాఫలకం ఏర్పాటుచేశారు. ఆస్పత్రి నిర్మాణం జరిగిపోతుందనే భ్రమ కల్పించేలా ప్రచారార్భాటం చేశారు. శిలాఫలకంలో ఏ నిధులు ఖర్చు చేస్తున్నారో.. కాంట్రాక్టర్, ఇంజనీర్ల వివరాలు కూడా ఇవ్వలేదు. ఇంతలో ఎన్నికల కోడ్ వచ్చేసింది.



టీడీపీ హయాంలో శిలా ఫలకంతో సరిపెట్టిన దృశ్యం

నేడు పనులు వేగవంతం

పాలకొల్లు ఏరియా ఆస్పత్రి నిర్మాణ ఆవశ్యకతను గుర్తించిన సీఎం జగన్ ఇక్కడ 100 పడకలు సరిపోవని 150 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రెండేళ్ల క్రితం ప్రస్తుత ప్రభుత్వాస్పత్రి వెనుక భాగంలో నూతన భవన నిర్మాణ పనులు చేపట్టారు. రెండు నెలల్లో ఆస్పత్రి నిర్మాణం పూర్తికానుంది. ప్రస్తుతం రూ.12.60 కోట్లతో ఏరియా ఆస్పత్రి, 50 పడకల భవన నిర్మాణం చేపట్టారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో మెడికల్ యూనిట్లు, డాక్టర్లు, అత్యవసర విభాగాలు ఏర్పాటు చేస్తున్నారు. మొదటి అంతస్తులో బెడ్లు, మరిన్ని మెడికల్ యూనిట్లు ఏర్పాటుచేసేలా నిర్మాణం చేపట్టారు. ఇదే భవనంపై మరో ఫ్లోర్ ఏర్పాటుచేసి మరో 100 పడకలకు నిర్మాణం చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు.



ఆస్పత్రి లోపల టైల్స్ పనులు చేస్తున్న దృశ్యం

శుభ పరిణామం



ప్రభుత్వాస్పత్రికి నూతన నిర్మాణం చేపట్టడం శుభపరిణామం. పాత భవనం అధ్వానంగా, ప్రమాదకరంగా ఉంది. గతంలో 100 పడకల ఆస్పత్రి అన్నారు. సీఎం జగన్ 150 పడకల ఆస్పత్రి నిర్మాణానికి సంకల్పించారు. కార్పొరేట్ స్థాయి వసతులతో ఇక్కడ ఆస్పత్రి నిర్మాణం పూర్తి కావాలని ఆశిస్తున్నాం.

– టి.పద్మజ, గృహిణి, పాలకొల్లు

అదృష్టంగా భావిస్తున్నాం



ఆస్పత్రి నూతన నిర్మాణం అత్యాధునిక వసతులతో చేపట్టినట్టు కనిపిస్తోంది. జగనన్న ప్రభుత్వం పాలకొల్లు నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు రూ.475 కోట్లతో వైద్య కళాశాల నిర్మాణం, రూ.16.60 కోట్లతో ఏరియా ఆస్పత్రి నిర్మాణం చేపట్టడం అదృష్టంగా భావిస్తున్నాం. పాలకొల్లుతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఇదే పెద్దాసుపత్రి.

– జి.ఎస్వీ రాజా, కూల్‌డ్రింక్ షాపు, పాలకొల్లు

అతి త్వరలో అందుబాటులోకి..



ఖర్చులు పెరగడంతో గత ఎస్టిమేషన్లు రూ.12.60 కోట్లతో ఇక్కడ 50 పడకల ఆస్పత్రి మాత్రమే నిర్మాణమవుతుంది. దీంతో దగ్గులూరులో నిర్మించనున్న వైద్య కళాశాల నిధుల నుంచి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి రూ.4 కోట్లు మంజూరు చేయగా మరో 100 పడకల నిర్మాణం చేపట్టనున్నాం. 50 పడకలకు సంబంధించిన పనులు రెండు నెలల్లో పూర్తి కానున్నాయి. సెకండ్ ఫ్లోర్‌లో వేయనున్న 100 పడకల నిర్మాణం పూర్తికావడానికి మరో ఆరు నెలలు పడుతుంది. ఇక్కడ మొత్తంగా రూ.16.60 కోట్లతో అతి త్వరలో 150 పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తవుతుంది.

– ఎం.శ్రీనివాసరెడ్డి, ఏపీ ఎంఎస్ఐడీసీ, డీఈఈ

న్యూస్‌రీల్

డిప్యూటీ సీఎంను కలిసిన డీఎస్పీ



మంత్రి కొట్టుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎస్పీ

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన డీఎస్ఆర్వీఎస్ఎన్ మూర్తి శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణలో రాజీలేని ధోరణి అవలంబించాలని మంత్రి కొట్టు సూచించారు. తనవంతు సహాయ, సహకారాలు ఉంటాయన్నారు.

'చలో విజయవాడ'కు అనుమతుల్లేవు



అజిత, ఎస్పీ

భీమవరం: పోలీసుల అనుమతులు లేకుండా ఎటువంటి ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొన్నా చర్యలు తీసుకుంటామని ఎస్పీ వేజెండ్ల అజిత హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. ఈనెల 18న ఏపీసీపీఎస్‌ఈఏ ఉద్యోగులు తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి అనుమతులు లేవని పేర్కొన్నారు. జిల్లాలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున పోలీసుల అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదని తెలిపారు. ఆందోళన కార్యక్రమాల్లో అసాంఘిక శక్తులు చేరి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశముందని పేర్కొన్నారు.

టెండర్ల ఆహ్వానం

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందజేసే ఇళ్ల పట్టాలు ప్రింట్ చేసేందుకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌చార్జి కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న మధ్యాహ్నం 3 గంటలలోపు కలెక్టరేట్‌లోని డీఆర్వో కార్యాలయంలో సీల్డ్ టెండర్లు అందజేయాలని సూచించారు. వివరాలకు కలెక్టరేట్‌లోని ల్యాండ్ విభాగంలో సంప్రదించాలని కోరారు.

అత్యవసర వైద్యం.. కాపాడిన ప్రాణం



పెంటయ్యకు చికిత్స అందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ప్రభుత్వం వైద్య సేవల్లో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వాస్పత్రుల్లో అత్యంత ఖరీదైన ఇంజక్షన్లు అందుబాటులోకి తెచ్చింది. దీంతో జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రి వైద్యులు ఓ వృద్ధుడి ప్రాణాలు కాపాడగలిగారు. వివరాలిలా ఉన్నాయి.. ప్రగడపల్లికి చెందిన పసలపూడి పెంటయ్య (70)కు గుండెపోటు రాగా జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి వచ్చాడు. సూపరింటెండెంట్ బేబీ కమల ఆయన్ను పరిశీలించి ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న రూ.40 వేల విలువైన టెనిక్టిప్లస్ ఇంజక్షన్ చేశారు. ఈ ఇంజక్షన్ వల్ల గుండెకు రక్తప్రసరణ సాఫీగా సాగుతుందని, 24 గంటల పాటు ఎటువంటి ప్రమాదం ఉండదని ఆమె అన్నారు. అనంతరం పెంటయ్యను 108లో విజయవాడ సిద్ధార్థ ఆస్పత్రికి తరలించారు. రోగి బంధువులు సీఎం జగన్, ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ ప్రాక్టికల్స్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లాలోని 27 కేంద్రాల్లో ఇంటర్మీడియెట్ జనరల్, 5 కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు శనివారం ప్రాక్టికల్స్ నిర్వహించారు. ఉదయం 1,457 మందికి 1,421 మంది, మధ్యాహ్నం 1,210 మందికి 1,186 మంది హాజరైనట్టు పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకర్ తెలిపారు.

ఏలూరులో 'పొత్తు' పంచాయితీ

- టీడీపీ, జనసేన మధ్య టికెట్ వార్
- జనసేనకు ఇస్తే కాపుకాయమని టీడీపీ తీర్మానం
- టీడీపీకి ఇస్తే పనిచేయమని జనసేన నేతల పట్టు
- నెల రోజులుగా వాడీవేడి సమావేశాలు
- రెండు పార్టీల్లోనూ అభ్యర్థుల స్వయం ప్రకటనలు
- కార్యకలాపాలకు దూరంలో రెండు పార్టీల కేడర్



బడేటి చంటి



రెడ్డి అప్పలనాయుడు

సాక్షి ప్రతినిధి, ఏలూరు : ఏలూరులో టీడీపీ, జనసేన మధ్య టికెట్ పంచాయితీ రోజురోజుకూ తీవ్రమవుతోంది. జనసేనకు టికెట్ ఇస్తే కాపు కాసేది లేదని టీడీపీ నేతలు హుకుం జారీ చేశారు. ఇక టీడీపీ అభ్యర్థి టికెట్ దక్కించుకుంటే తాము ఎట్టి పరిస్థితుల్లో సహకరించబోమని, పోటీలో ఉంటామని జనసేన నేతలు బహిరంగంగా చెబుతున్నారు. సీట్లు ఖరారు కాకుండా పొత్తు ఖరారు కావడంతో ఏలూరు వ్యవహారం రెండు పార్టీలకూ తలనొప్పిగా మారింది. దీంతో రెండు పార్టీల్లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి.

అంతా గందరగోళం

ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ సీటు కొద్దిరోజుల క్రితం పొత్తుల్లో టీడీపీకి ఖరారైందని టీడీపీ ఇన్‌చార్జి బడేటి చంటి ప్రచారం చేసి హోర్డింగులు పెట్టి హడావుడి చేశారు. దీనిపై జనసేన నాయకులు 'మేము రెడీ..' అంటూ కౌంటర్ ఫ్లెక్సీలతో హంగామా చేశారు. టీడీపీ నేతలు మరో అడుగు ముందుకేసి సోషల్ మీడియాలో టికెట్ టీడీపీదే అని జనసేనను బుజ్జగించేలా పోస్టులు పెట్టారు. ఈ క్రమంలో జనసేన నేతలు వరుస సమావేశాలు నిర్వహించి ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు అంటూ ప్రకటించారు. దీనిపై టీడీపీలో మల్లగుల్లాలు మొదలయ్యాయి. ఇదిలా ఉండగా జనసేనలో అకస్మాత్తుగా తెరపైకి మరో కొత్త నేత వచ్చారు. తాను పవన్‌కల్యాణ్‌ను కలిసి పార్టీ ఫండ్ ఇచ్చానని, తనకే టికెట్ అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి మరో గందరగోళానికి తెరదీశారు.

కులం.. బలం.. తేలని పంచాయితీ

ఏలూరు టీడీపీ ఇన్‌చార్జిగా బడేటి చంటి, జనసేన నగర ఇన్‌చార్జి, ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధిగా రెడ్డి అప్పలనాయుడు కొనసాగుతున్నారు. బడేటి చంటి పుట్టినరోజు పేరుతో ఆత్మీయ విందును ప్రకటించారు. దీంతో జనసేన నేత అప్పలనాయుడు అప్రమత్తమై ముందు రోజే జనసైనికుల ఆత్మీయ సమావేశం పేరుతో సభ నిర్వహించి టికెట్ జనసేనదేనని ప్రకటించారు. మరుసటి రోజు చంటి పుట్టినరోజు వేడుకల సభలో టికెట్ టీడీపీకి ఖరారైందని, అభ్యర్థి తానేనని స్వయం ప్రకటన చేశారు. తన సామాజిక వర్గానికి కాకుండా వేరే సామాజిక వర్గానికి టికెట్ ఇస్తే కాపుకాయవద్దంటూ ప్రకటించడంతో రెండు పార్టీల మధ్య వివాదం రేగింది.

వట్టి వసంత్‌కు ఘన నివాళి



వట్టి వసంత్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎంపీ కోటగిరి శ్రీధర్, మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: రాష్ట్ర మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ చిరస్మరణీయుని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎం పురం గ్రామంలో శనివారం వసంతకుమార్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, పుప్పాల వాసుబాబు, వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్, మాజీ ఎమ్మెల్యేలు గన్ని వీరాంజనేయులు, ఈలి నాని వసంత్‌కుమార్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. వసంతకుమార్ సోదరుడు రమేష్, కుమారుడు పవన్‌ను పరామర్శించారు. ఉంగుటూరు ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ వసంతకుమార్ ఎమ్మెల్యేగా, మంత్రిగా ఈ ప్రాంత అభివృద్ధికి విశేషంగా కృషిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో అప్పడా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్‌నాయుడు, డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి శ్రీనువాసరావు, సర్పంచ్ దాయం సుజాత తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి పటిష్ట ఏర్పాట్లు

పోలవరం రూరల్: పట్టిసం శివక్షేత్రంలో వచ్చేనెల 8న జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ, ఉత్సవ కమిటీ చైర్మన్ కె.అద్దయ్య ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉత్సవ ఏర్పాట్లపై శనివారం సమీక్షించారు. దర్శనం క్యూలైన్లు, తాగునీటి సదుపాయంపై సూచనలిచ్చారు. పంట్లు, కాలిబాటను పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. స్నానఘట్టాల వద్ద గజఈతగాళ్లను ఉంచాలని, ఐరెన్ బారి కేడింగ్ సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, వైద్య పరికరాలు, అంబులెన్స్‌లు సిద్ధం చేయాలన్నారు. పట్టిసం గ్రామ కార్యదర్శులు బదిలీపై వెళ్లిన తర్వాత కొత్త కార్యదర్శులకు పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగించకపోవడంపై ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి ఆర్డీఓ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జి.శ్రీనును ఆర్డీఓ ఆదేశించారు. తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్, సర్పంచ్ ఎస్.శ్రీరామమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ అద్దయ్య

ఇంక్రిమెంట్ మంజూరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో 292 హైస్కూల్ ప్లస్‌లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు ప్రభుత్వం అదనపు ఇంక్రిమెంట్ మంజూరు చేసిందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ఖజానా అధికారి మెమో విడుదల చేశారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు హైస్కూల్ ప్లస్‌లో పనిచేసినంత కాలం మాత్రమే ఇంక్రిమెంట్ వర్తిసుందని తెలిపారు.

సీఎం జగన్‌తోనే దళితుల సమగ్రాభివృద్ధి

ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: సీఎం జగన్‌తోనే రాష్ట్రంలో దళితుల సమగ్రాభివృద్ధి సాధ్యమని, సమాజంలో దళిత, గిరిజన, బీసీ, మైనార్టీ వర్గాలకు మేలు జరుగుతుందని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలోని జంగారెడ్డిగూడెం రోడ్డులో సుమారు రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ మాదిగ భవన్‌ను శనివారం వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, మేయర్ నూర్జహాన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దళితుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. మాదిగల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఈ భవనాన్ని నిర్మించామనీ, మరింత ఆధునీకరించేందుకు చేయూత అందిస్తామన్నారు. జగ్జీవన్‌రామ్ పోరాటాల స్ఫూర్తిగా ముందుకు సాగాలన్నారు. గతంలో ఇజ్రాయేల్‌పేటలో నిర్మించిన సామాజిక భవనాన్ని దివంగత వైఎస్సార్ స్వయంగా వచ్చి ప్రారంభించారని గుర్తు చేశారు. దళితులకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పిస్తూ పలు పదవులను సీఎం జగన్ ఇస్తున్నారన్నారు. ఏలూరు కో–ఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్‌గురునాథ్ మాట్లాడుతూ మాదిగల ఆకాంక్షలకు అనుగుణంగా 500 చదరపు గజాల స్థలంతోపాటు రూ.25 లక్షల నిధులను ఎమ్మెల్యే ఆళ్ల నాని మంజూరు చేశారనీ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులంతా విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తేరా ఆనంద్, మారంపూడి పౌలు రాజు, పాలిమేర హరికృష్ణ, ఇనపనూరి జగదీష్, కందుల రమేష్, మేతర అజయ్‌బాబు, తోటకూర కిషోర్, బిషప్ డాక్టర్ కారుపాటి శాంతిసాగర్, ఫాదర్ బాల, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు పాలిమేర జయదాసు, కార్పొరేటర్లు జిజ్జువరపు విజయనిర్మల, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, కో–ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్, మాదిగ సమాఖ్య ఉద్యోగ సంఘ, దళిత సంఘ నేతలు పాల్గొన్నారు.



మాదిగ భవన్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని, చిత్రంలో ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్

చినవెంకన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



అనివేటి మండపంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దీంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌తో పాటు, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. క్షేత్రంలో సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

రమణీయం.. శోభనాచల రథోత్సవం

ఆగిరిపల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఆగిరిపల్లిలోని శోభనగిరిపై వెలసిన శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం శనివారం నేత్రపర్వంగా సాగింది. స్థానిక స్వామి వారి కల్యాణ మండపంలో శుక్రవారం అర్ధరాత్రి శ్రీశోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామికి రాజ్యలక్ష్మి, గోదా అమ్మ వార్లతో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో కనులపండుగగా తిరుకల్యాణం జరిపించారు. అనంతరం ఉత్సవ మూర్తులను విశేష పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంపై ఆసీనులను గావించారు. నూజివీడు డీఎస్పీ చిటికెన మురళీకృష్ణ, నూజివీడు రూరల్ సీఐ బాల సురేష్, తహసీల్దార్ మృత్యుంజయరావు ఆలయ ధర్మకర్త ప్రతినిధులతో అర్చకులు వేదాంతం శేషుబాబు ప్రత్యేక పూజలు జరిపించి రథోత్సవాన్ని ప్రారంభించారు. కల్యాణ మండపం మీదుగా దమ్మన్న మండపం, వెంకటాచల మండపం, పొగడ చెట్ల మండపం మధ్య ఉన్న నాలుగు వీధుల మధ్య సాగిన రథోత్సవం తిరుమలలోని శ్రీవారి రథోత్సవాన్ని తలపించింది. లక్ష్మీనరసింహ, గోవింద నామస్మరణతో ఈ ప్రాంతం మార్మోగింది. పొన్నం వెంకట లక్ష్మణరావు సోదరుల సహకారంతో రథాన్ని పుష్పాలతో అలంకరించారు. గ్రామానికి చెందిన అద్దంకి శివ సత్యనారాయణ సోదరులు, వారి బృందం రథసారథులుగా వ్యవహరించారు. ఆలయ అర్చకులు శేషుబాబు, అనంతకృష్ణ ఇతర వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో సీతారామయ్య రథోత్సవం ఏర్పాట్లను పర్యవేక్షించారు. నూజివీడు డీఎస్పీ ఆధ్వర్యంలో ఎస్సై సురేంద్ర కుమార్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.




రథంలో కొలువుదీరిన స్వామివారి ఉత్సవ మూర్తులు, ఆగిరిపల్లిలో స్వామివారి రథోత్సవంలో అశేష భక్తజన సందోహం

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

రథోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కేరళ మృదంగం, ఖమ్మం జిల్లా చౌటపల్లి మహిళల కోలాటం, బుట్టబొమ్మలు బాణసంచా వెలుగులు నడుమ రథోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్తల ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, జెడ్పీటీసీ సభ్యులు వీరబాబు, ఎంపీటీసీ సభ్యులు గోపి, అన్నదాన కమిటీ సభ్యులు ప్రణీత్, మురళీ, మాజీ ఎంపీటీసీ నక్కనబోయిన పండు, వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు, సక్కేశ్వర్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆగిరిపల్లిలో స్వామివారి దివ్య రథోత్సవాన్ని ప్రారంభించిన డీఎస్పీ చిటికెన మురళీకృష్ణ



రథోత్సవంలో కోలాట ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు



రథోత్సవంలో కేరళ మృదంగం బృంద విన్యాసాలు

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు

సహకరించాలి



ద్వారకాతిరుమలలో తనిఖీల నిమిత్తం ఓ కిరాణా షాపు వద్ద అధికారులు, సిబ్బంది

ద్వారకాతిరుమల: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు పిల్లల తల్లిదండ్రులు, సంరక్షకులు సహకరించాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ (సర్కిల్-2 ఏలూరు) జె.గోపాలకృష్ణ కోరారు. ద్వారకాతిరుమల క్షేత్రంలోని కొండ పైన, కొండ దిగువన పలు దుకాణాల్లో ఆయన శనివారం తనిఖీలు నిర్వహించారు. బాలలతో ఎవరైనా పనులు చేయిస్తున్నారేమోనని పరిశీలించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ బాలలను హోటల్స్, కిరాణా, మెకానిక్ షాపుల్లో పనులు చేయిస్తే సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. కేసు నమోదైతే 6 నెలల నుంచి 2 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు జరిమానా, ఒక్కోసారి రెండు శిక్షలు విధిస్తారన్నారు. బాలలను పనిలో చేర్పించే తల్లిదండ్రులు, సంరక్షకులు సైతం శిక్షార్హులవుతారని, వారికి రూ.10 వేల వరకు జరిమానా విధిస్తారని చెప్పారు. పిల్లలను చదువు లేదా వృత్తి విద్యా నైపుణ్యం వైపు ప్రోత్సహిస్తే వారు బాల మేధావులుగా ఎదుగుతారన్నారు. తల్లిదండ్రులు, సంరక్షకులు పిల్లల తాత్కాలిక సంపాదనకు అలవాటు పడకుండా వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇప్పిస్తే బాల కార్మిక నియంత్రణ, నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జి.వెంకటరమణన్, జిల్లా కోర్టు వలంటీర్ డీఎల్ఎస్ఏ మోహన్‌రావ్, మండల సీఆర్పీ అశోక్, జీఎంఎస్‌కే లక్ష్మీసుజన తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే కోకోలో అధిక దిగుబడి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కోకో పంటలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని పెదవేగి ఆయిల్‌పామ్ రీసెర్చ్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త ఎంవీ ప్రసాద్ స్పష్టం చేశారు. శనివారం ఏలూరులోని ఓ హోటల్‌లో జిందాల్ కోకో సంస్థ ఆధ్వర్యంలో కోకో రైతులకు కోకో పంట యాజమాన్యంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కోకో పంటకు నీరు అధికంగా పెడితే పూత, పిందె రాలిపోతుందని, అంతేకాక తెగుళ్లు సోకే ప్రమాదం ఉందన్నారు. ఎరువులను ఒకేసారి కాక విడతల వారీగా వేయాలని సూచించారు. జూన్, జూలై నెలల్లో చెట్టు కొమ్మలను తొలగించాలని, అలాగే అక్టోబర్‌లో మరోసారి కొమ్మలు తొలగించాల్సి ఉంటుందన్నారు. పంట కోసిన తరువాత చాలా మంది రైతులు అవగాహనా లోపం వల్ల కోకో గింజల బరువులో 30 శాతం నష్టపోతున్నారని, కోసిన పంటను జాగ్రత్త చేయడంలో తగిన పద్ధతులు అవలంబిస్తే బరువు కోల్పోకుండా కాపాడుకోవచ్చన్నారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కాళిదాసు మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటలో అంతరపంటగా కోకోను కూడా పండించవచ్చన్నారు. గతంలో ఘనా దేశంలో పండించే కోకో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉండేదని, ప్రస్తుతం దేశంలో పండిస్తున్న కోకో ఆ స్థానాన్ని ఆక్రమించిందన్నారు. కోకో పంట కోత సమయంలో నూతన సాంకేతికతను జిందాల్ సంస్థ రైతులకు అందుబాటులోకి తీసుకువస్తే ఈ ప్రాంత రైతులకు మరింత ప్రయోజనకరంగా ఉంటుందని సూచించారు. అధిక వర్షాలు, ఎల్‌నినో సమస్యలతో ఈ ఏడాది కోకో పంట దిగుబడి గణనీయంగా తగ్గిందని, డిసెంబర్‌లో రావాల్సిన పూత ఫిబ్రవరిలో వస్తోందన్నారు. నాణ్యమైన గింజలు ఉత్పత్తి చేయగలిగితే అనేక బహుళజాతి సంస్థలు పంటలు కొనుగోలుకు ముందుకువస్తాయన్నారు. శాస్త్రవేత్త దీప్తిశ్రీ మాట్లాడుతూ కోకో పంటలో సేంద్రియ ఎరువు వినియోగిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని, పురుగు మందులు వాడితే పంట నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. సేంద్రియ ఎరువు వినియోగంతో ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ళ దిగుబడి సాధించిన దాఖలాలు ఉన్నాయన్నారు. హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధులు ఎం.రత్నమాల, వైవీ కృష్ణారావు, కోకో రైతులు జీవీఎస్ ప్రసాద్, బోయపాటి గణేష్, జిందాల్ కోకో సంస్థ ప్రతినిధులు పంకజ్ రావల్, రాజేష్ డోగ్రా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త ఎంవీ ప్రసాద్

ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక



ఎంపికైన కబడ్డీ జట్ల క్రీడాకారులతో జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు

తణుకు అర్బన్: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు తణుకు ఆదిత్య స్కూలు క్రీడా ప్రాంగణంలో శనివారం నిర్వహించినట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి యలమరెడ్డి శ్రీకాంత్ చెప్పారు. జిల్లా నలుమూలల నుంచి హాజరైన 250 మంది క్రీడాకారులకు సంబంధించి నైపుణ్యాన్ని పరిగణలోకి తీసుకుని బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశామని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. స్కూలు కరస్పాండెంట్ జి.ఆదిశేషు ఎంపిక పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు కె.కృష్ణారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సంకు సూర్యనారాయణ, డి.షణ్ముఖం, బి.ప్రదీప్, కె.లక్ష్మణ్, జి.తాతారావు, ఎస్‌కే అల్లాభక్షు, జి.శ్రీకాంత్, స్కూలు ప్రిన్సిపాల్ జి.రమాకాంత్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా గోపీకృష్ణ



తణుకు టౌన్: వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా తనను నియమించినట్టు తణుకు పట్టణానికి చెందిన న్యాయవాది చోడే గోపీకృష్ణ చెప్పారు. శనివారం ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకత్వానికి, రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలకు గోపీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

17 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



ఆగిరిపల్లిలో పట్టుబడిన రేషన్ బియ్యం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 17 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ ఎస్సై రంజిత్ కుమార్ శనివారం సిబ్బందితో కలిసి దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామంలోని ఉలసా వెంకట్రావు అనే వ్యక్తికి చెందిన ఇంట్లోపై దాడి చేశామన్నారు. వెంకట్రావుపై కేసు నమోదు చేసి బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు స్వాధీనపరిచినట్లు తెలిపారు. దాడిలో డిప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్, ఆర్ఐ నవీన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బీఎల్‌ఓల సస్పెన్షన్ తగదు

ఏలూరు (మెట్రో): ఓటర్ల జాబితాలో చిన్న చిన్న పొరపాట్లకు బీఎల్‌వోలను సస్పెండ్ చేయడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం, రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓటర్ల జాబితాలో పొరపాట్లపై కొందరు ఇస్తున్న ఫిర్యాదులకు విచారణ లేకుండా, షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా నేరుగా జిల్లా కలెక్టర్లు సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఎల్‌వో విధితో పాటు, అనేక రకాల విధులు నిర్వహిస్తున్నారని, కేవలం బీఎల్‌వో విధుల్లో చిన్నచిన్న పొరపాట్లపై సస్పెండ్ చేయడం తగన్నారు. వెంటనే సస్పెండ్ చేసిన బీఎల్‌వోలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు పాల్గొన్నారు.

పలు చోట్ల కార్డెన్ సెర్చ్

జంగారెడ్డిగూడెం: రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ ధనుంజయుడు తెలిపారు. జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్‌లో శనివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో నేరాలను అదుపు చేయాలనే ఉద్దేశంతో కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు చెప్పారు. కాగా, జంగారెడ్డిగూడెం డాంగే నగర్‌లో సుమారు 250 ఇళ్లల్లో శనివారం తనిఖీ చేసి సరైన పత్రాలు లేని 35 వాహనాలు సీజ్ చేశామన్నారు. నాగిరెడ్డిగూడెంలో 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 25 లీటర్ల సారా, 20 వాహనాలు సీజ్ చేశామన్నారు. ఎస్సైలు జ్యోతిబాస్, సుదీప్, రంగయ్య, 50 మంది సిబ్బంది పాల్గొన్నారు.

● గడపగడపకు సంక్షేమం



ఉండి : యండగండిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

క్లుప్తంగా

భక్తులతో కిటకిటలాడిన వరాల వెంకన్న ఆలయం



ఈడూరులో అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ జరిపారు. ఉదయం అర్చనలు చేసి, స్వామి వారిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరిపారు. పరిసర గ్రామాల నుంచి సుమారు 3వేల మంది భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు.

ఘనంగా అయ్యప్ప, ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

అత్తిలి: మంచిలి గ్రామం అయ్యప్పకాలనీలో అయ్యప్పస్వామి, ఆంజనేయస్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠాపన శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతిపూజ, హోమాలు, లింగార్చన, సాయంత్రం లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్పస్వామి మూలమంత్ర, గాయత్రీ హోమాలు జరిపారు. గ్రామ పురోహితులు పురాణపండ వెంకట సూర్య సుబ్బారావు, కందుకూరి గణేష్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన పూజాధికాలను నిర్వహించారు. ఆదివారం ఉదయం అయ్యప్పస్వామి, ఆంజనేయస్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం అఖండ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

అత్తిలి: దాళ్వా ఈ-పంట నమోదుకు సంబంధించి ఈ-కేవైసీ ప్రక్రియ మండలంలోగల ప్రతి రైతు భరోసా కేంద్రంలో జరుగుతోందని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. వేలిముద్రలు వేయించుకోవాల్సిన రైతులు సమీప రైతు భరోసా కేంద్ర ఇన్‌చార్జ్ వద్ద ఈ కేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ-క్రాప్‌లో ఈ- కేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే ధాన్యం అమ్మడానికి, పంట నష్ట పరిహారం, సున్నావడ్డీ, క్రాప్ ఇన్సూరెన్స్ వర్తిస్తాయని చెప్పారు.

9న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఏవీ నాగరాజు

తణుకు అర్బన్: మార్చి 9వ తేదీన తణుకు కోర్టులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ శాతం కేసులు పరిష్కరించేలా పోలీసు అధికారులు కృషి చేయాలని రెండవ అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఏవీ నాగరాజు అన్నారు. తణుకు కోర్టులో శనివారం పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ, మండల న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు తణుకు కోర్టు ప్రాంగణంలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకాదగ్గ క్రిమినల్ కేసులన్నీ ఇరువర్గాలతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో తణుకు కోర్టు పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాసవి, వనిత క్లబ్‌ల సేవలు అభినందనీయం



వాసవి, వనిత క్లబ్ సభ్యులతో జోన్ చైర్‌పర్సన్ లక్ష్మి

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి, వనిత క్లబ్‌లు సేవలు అభినందనీయమని జోన్ చైర్‌పర్సన్ ఆలపాటి అచ్యుత లక్ష్మి కొనియాడారు. వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలోని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆదేశాలతో జోన్ చైర్‌పర్సన్ విజిట్‌లో భాగంగా శనివారం పేద మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. మహిళా కుటుంబాలకు బియ్యం, వంట సరుకులు అందజేశారు. ఆవరణలో మొక్కలు నాటారు. చిన్నారులకు స్వీట్లు, స్కెచ్ పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు నున్న ఆనంద్, కార్యదర్శి వీఆర్ గుప్తా, కోశాధికారి రంగా పి.స్వర్ణకాంతి, కె.సత్యకోటేశ్వరీ, నాగలక్ష్మి, డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు న్యూరో సర్జన్ అలంపురం రాక

పెంటపాడు: విజయవాడకు చెందిన ప్రముఖ న్యూరాలజిస్ట్ (మెదడు, నరాలు) వైద్యనిపుణులు డాక్టర్ తీగల రమేష్ ఆదివారం అలంపురం ట్రస్టు ఆస్పత్రికి రానున్నట్లు వెంకటరమణ ట్రస్టు ఆస్పత్రి ప్రతినిధి కొలనువాడ పెద కృష్ణంరాజు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి తల, మెదడు, వెన్నెముక, నరాలకు సంబంధించిన పరీక్షలు చేస్తారన్నారు.

గూడెంలో ప్రగతి పరుగులు



చినతాడేపల్లిలో గడపగడపకు హామీలో వేసిన రహదారి



అద్దంలా వేసిన రోడ్డు

- రాజమార్గాలకు కేరాఫ్‌గా గ్రామాల్లో రోడ్లు
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు

తాడేపల్లిగూడెం: అభివృద్ధి పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకోవడం, జేబులు నింపుకోవడం టీడీపీ నేతలకు వెన్నతో పెట్టిన విద్య. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందుకు భిన్నంగా సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేశారు. సుమారు రూ.8.25 కోట్లు వెచ్చించి చక్కనైనా రహదారులను నిర్మించారు. ఎటువంటి అవినీతికి అస్కారం లేకుండా పారదర్శకంగా రోడ్లను నిర్మించారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మాణాలు పూర్తి చేసిన ఘనత ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు దక్కింది. గత ప్రభుత్వ కాలంలో గూడెం రూరల్ మండలంలో రహదారుల పరిస్థితి ప్రధాన రహదారుల నుంచి అంతర్గత రహదారుల వరకు, లింకు రోడ్ల వరకు బాగు చేసిన రోజులు లేవు. కానీ వైఎస్సార్ సీపీ పాలనలో ఈ ఐదేళ్ల కాలంలో మండల ప్రజల కష్టాలకు తెరపడింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రోడ్ల నిర్మాణం కోసం నిధులు రావడంతో మండలంలోని గ్రామాల్లో అధ్వాన్న రహదారుల స్థానంలో అద్దం లాంటి రోడ్లు వచ్చాయి. సుమారు రూ.8.25 కోట్లతో రోడ్లను నిర్మించారు.

రూ.5.25 కోట్లతో సీసీ రోడ్లు

ఆరుగొలనులో రూ. 60 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించారు. కొండ్రుపోలు గ్రామంలో అంతర్గత సీసీ రోడ్ల కోసం రూ. కోటీ 40 లక్షలతో సీసీ రోడ్లు వేశారు. కొన్ని పురోగతిలో ఉన్నాయి. కుంచనపల్లిలో కోటీ పది లక్షల రూపాయలతో రహదారుల నిర్మాణం జరిగింది. నీలాద్రిపురంలో రూ.40 లక్షలతో రహదారులు వేశారు. పడాల గ్రామంలో రూ.75 లక్షలతో రోడ్లు వేశారు. పెదతాడేపల్లి గ్రామంలో రూ.75 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించారు. చినతాడేపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో , జగన్నాథపురంలో రూ.20 లక్షలతో, కడియద్దలో రూ.40 లక్షలతో, కొమ్ముగూడెంలో రూ.20 లక్షలతో, కృష్ణాయపాలెంలో రూ.20 లక్షలు, నవాబుపాలెంలో రూ.20 లక్షలతో, పట్టింపాలెంలో రూ.20 లక్షలు, వీరంపాలెంలో రూ.20 లక్షలు, మాధవరంలో రూ.20 లక్షల రూపాయలు వెచ్చించి అంతర్గత, అనుసంధాన సీసీ రోడ్లు నిర్మించారు. జగ్గన్నపేటలో ఐదు లక్షలు, చినతాడేపల్లిలో ఐదు లక్షలు, మోదుగ్గుంటలో పది లక్షలు, బంగారుగూడెంలో ఐదు లక్షలు, ఉప్పరగూడెంలో ఐదు లక్షలు, మాధవరంలో మరో ప్రాంతంలో పది లక్షలు, వెంకట్రామన్నగూడెంలో ఐదు లక్షలు , ఆరుళ్లలో ఐదు లక్షలతో రహదారులు వేశారు.

రోడ్లకు మహర్దశ



తెలుగుదేశం పార్టీ హయాంలో రోడ్లు అధ్వాన్నంగా ఉండేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో రోడ్లు వేశారు. రహదారులకు మహర్దశ పట్టింది. ప్రజల కష్టాలు తీరాయి.

– మార్లపూడి సుబ్బారావు,పుల్లాయిగూడెం

సమాజాభివృద్ధిలో గణాంక శాస్త్రం ఎంతో ఉపయోగం

తణుకు టౌన్: సమాజ అభివృద్ధిలో గణాంక శాస్త్ర ప్రాముఖ్యం ఎక్కువగా ఉందని తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల ప్రిన్సిపల్ కె రామకృష్ణ చెప్పారు. శనివారం గణాంక శాస్త్ర పితామహుడు ఆర్ఏ ఫిషర్ 134వ జయంతి సందర్భంగా కళాశాల విద్యార్థినులకు నిర్వహించిన వివిధ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫిషర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రణాళిక బద్ధ అభివృద్ధికి గణాంక శాస్త్రం ఎంతో ఉపయోగపడిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పీపీటీ, వ్యాసరచన, క్విజ్, వివిధ రకాల సర్వేల గురించి విద్యార్థినులకు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో గణాంక శాస్త్ర అధ్యాపకులు సీహెచ్ నాగరాజు, ఏ దీప్తి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో నాణ్యతా ప్రమాణాల పరిశీలన

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్పలో కొప్పర్తి వీరాస్వామి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండార్డ్స్ (హెచ్‌క్యూఏఎస్) బృంద సభ్యులు రెండో రోజు శనివారం నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. డాక్టర్ ఎమ్ఎస్ సౌమ్య మహంతి నేతృత్వంలో సభ్యులు పీహెచ్‌సీని పర్యవేక్షించి ఔట్ పేషెంట్స్ ఎంత మంది వస్తున్నారు? వారికి ఎలాంటి వైద్య సేవలు అందుతున్నాయి? ఆస్పత్రిలో సౌకర్యాలు పరిశీలించారు. బృంద సభ్యులు ప్రీతీష్ సూర్యకాంత్ లెజెడె, జిల్లా క్వాలిటీ మెడికల్ ఆఫీసర్ తోటే అనిత తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కమిటీలు ఇవే

తాడేపల్లిగూడెం: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ తాడేపల్లిగూడెం అనుబంధ విభాగాల కమిటీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ వివరాలిలా ఉన్నాయి..

- పెంటపాడు మండల అధ్యక్షునిగా కైగాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా రెడ్డి సూరిబాబు, నల్లమిల్లి విజయానంద రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా గోడె శ్రీను, ములగాల బాబ్జీ, దేవాబత్తుల వెంకన్న బాబు, కట్టుబోయిన కృష్ణప్రసాద్‌లు ఎంపికయ్యారు. కార్యదర్శులుగా సంపత కృష్ణారావు, మట్టా సత్యానారాయణ, బోణం వీరయ్య, కొలనువాడ సత్యనారాయణరాజు, డొకల కన్నయ్య, చల్లా కుమారస్వామి, పసల గంగారామచంద్ర, వల్లూరి బ్రహ్మానందంలను నియమించారు. సంయుక్త కార్యదర్శులుగా పేరిచర్ల కిరణ్‌కుమార్‌రాజు, బుద్దన చంటి రామకృష్ణ, చింతపల్లి శ్రీనివాసు, పాల గణపతి, జామి కృష్ణ, జాలపర్తి నాగేశ్వరరావు, వెలగల శ్రీనివాసరెడ్డి, దాసి బాబులు ఎంపికయ్యారు.

గూడెం మండల పార్టీ అధ్యక్షుడిగా జద్దు హరిబాబు

గూడెం మండల పార్టీ అధ్యక్షునిగా జద్దు హరిబాబు నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా మేణ్ని రామారావు, మాచిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శులుగా చిట్టూరి కాశీవిశ్వనాథం, మద్దుకూరి మెహర్ ప్రసాద్, పాకనాటి తాతాజీ, గంటి సర్వేశ్వరరావు, పత్సా వీరవెంకటరాజులు ఎంపికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా అడ్డాల గోపీకృష్ణ, కోపల్లి బలరామకృష్ణంరాజు, కంకట రాజారత్నం, మార్లపాటి వెంకటరత్నం, పెండెం భాస్కరరావు, తాడేపల్లి మోషె, గజ్జరపు రామకృష్ణ, ములకల చిన శ్రీను, పరిమి గోపాలకృష్ణ, దాకే పండియ్య, మాదేపల్లి సూర్యనారాయణ, కామన చంద్రరావు, ఉలుసు శ్రీనివాసు, సబ్బితి బ్రహ్మయ్య, పెనుమాక రాజు, తిరుమళ్ల శ్రీనివాసు, గుండుగొల్లు ప్రసాద్, కొనగళ్ల బులివెంకన్నలను నియమించారు.

వైఎస్సార్‌సీపీ తణుకు పట్టణ కమిటీ ఎంపిక



మంగెన సూర్య, వైఎస్సార్‌సీపీ తణుకు పట్టణ అధ్యక్షుడు

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం వైఎస్సార్ సీపీ తణుకు పట్టణ కమిటీని శనివారం ప్రకటించింది. పార్టీ తణుకు పట్టణ అధ్యక్షుడిగా మంగెన సూర్య, ఉపాధ్యక్షులుగా డీజే అమూల్యారావు, గుబ్బల సూర్యచంద్రరావు, ప్రధాన కార్యదర్శులుగా సామంతుల అప్పారావు, సుద్దుల పాండు, కర్రి గంగాధర అప్పారావు, ఆర్తమూరి వెంకటరెడ్డి, సప్పా బలరామకృష్ణ, కార్యదర్శులుగా రేలంగి రాంబాబు, మలకలపల్లి సత్యనారాయణ, మండ సూరిబాబు, వెలగల తిమ్మారెడ్డి, షేక్ అబ్దుల్ ఖాదర్ జిలానీ, కోశాధికారిగా మానేపల్లి శేఖర్, కార్యవర్గ సభ్యులుగా గారపాటి సత్యనారాయణ, డోలా సింహాద్రి, షేక్ సలీం, దున్నాల ఉమామహేశ్వరరావు, తానేటి వీరయ్య, యల్లమిల్లి రమేష్ బాబు, ఉమ్మిడిసింగ్ శ్రీనివాస్, ఆచంట ఫణి కుమార్, కలవపూడి బాబు, కంచుమర్తి విశ్వేశ్వరరావు, పుల్లెపు సూర్యచంద్రరావు, గంటా ప్రసాద్, వన్నెంరెడ్డి మోహన్‌మురళి, కొల్లు బాబు, సానబోయిన దుర్గారావు, సందాపు దుర్గారావు, యారబాటి రామకృష్ణలను నియమించారు.

వందశాతం ఫలితాలు సాధించాలి



తాడేపల్లిగూడెం(టీఓసీ): మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న దృశ్యం



పెంటపాడు: ప్రభుత్వ బేసిక్ స్కూల్లో పదోతరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

తాడేపల్లిగూడెం (టీఓసీ): పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని డీఈఓ ఆర్.వెంకట రమణ అన్నారు. పట్టణంలోని తాళ్ళముదునూరుపాడులోని మున్సిపల్ ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించి విద్యార్థుల ప్రగతిని సమీక్షించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎంఈఓ పీఎంకే జ్యోతి, ఉన్నతపాఠశాల హెచ్ఎం నిమ్మల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాటశాలలో పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీవైఈఓ రవీంద్రభారతి, హై స్కూల్ హెచ్ఎం మైనం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులు ఏ గ్రేడ్ సాధించాలి

పెంటపాడు: ప్రణాళికా బద్ధంగా చదువుతున్న పదోతరగతి విద్యార్థులంతా ఏ గ్రేడ్ సాధించేలా పాటు పడాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్. వెంకటరమణ పేర్కొన్నారు. పెంటపాడు ప్రభుత్వ పోస్టు బేసిక్ పాఠశాలను అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పరీక్షలు అంటే విద్యార్థులలో భయం పోవాలన్నారు. మంచి మార్కులతో ప్రతి ఒక్కరూ పాస్ కావాలన్నారు. ఎంఈవోలు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పదో తరగతి తరగతులను పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీనివాస్, టీవీ రామకృష్ణ, బేసిక్‌స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

19న వలంటీర్లకు పురస్కారాలు

పెంటపాడు: ఈనెల 19న మధ్యాహ్నం 3గంటలకు గూడెంలోని బలుసులమ్మ ఆలయ ఆవరణలో వలంటీర్లకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు పెంటపాడు ఎంపీడీవో సీహెచ్ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది విధిగా హాజరుకావాలన్నారు. పెంటపాడు మండలంలో 430 మంది వలంటీర్లకు ఈ పురస్కరాలు అందజేస్తారన్నారు.

ఉద్యోగుల ఆర్థిక బకాయిలు చెల్లించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉద్యోగులు ఆర్థిక బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తాలూక ఆఫీస్ సెంటర్ ప్రాంగణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వక్తలు మాట్లాడుతూ 30 శాతం మధ్యంతర భృతి, పీఆర్సీ ఎరియర్స్, పెండింగ్ డీఏ అరియర్స్, సరెండర్ లీవ్ బకాయిలు, లోన్‌లు బకాయిలు, మెడికల్ రీయంబర్స్‌మెంట్, అడిషనల్ క్వాంటం, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని తదితర సమస్యలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ జేఏసీ చైర్మన్ జి.చంద్రశేఖర్, కో కన్వీనర్ పి.శివప్రసాద్, బీవీ నారాయణ, వెంకన్న సాహెబ్, పెన్షనర్స్ అధ్యక్షుడు హరికుమార్, దాసం నాగేశ్వరరావు, వైవీఎస్ఎన్ మూర్తి, గరికపాటి సుబ్రహ్మణ్యం శర్మ పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం



పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో హెచ్ఐవీపై కళాజాతను ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): హెచ్ఐవీపై అవగాహన పెంపొందించి నియంత్రణే లక్ష్యంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర ఆరోగ్యశాఖ విభాగం ఆదేశాల మేరకు కళాజాతలకు రూపకల్పన చేసింది. అందులో భాగంగా వీధి నాటకాలు ప్రదర్శించడం మూలంగా ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు సిద్ధమైంది. ఈ కార్యక్రమాన్ని శనివారం తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎ.సూర్యనారాయణ ప్రారంభించారు. పట్టణంలోని బ్రహ్మానందరెడ్డి మార్కెట్, ఇందిరానగర్ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు జరిగాయి. వక్తలు మాట్లాడుతూ ఎయిడ్స్‌ను నివారించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సూపర్ వైజర్ ఫహరినాథ్‌కుమార్, డాక్టర్ బీఎల్ వరప్రసాద్, ఏఆర్‌టీ ఎస్ఎంఓ, ఏరియా ఆస్పత్రి సిబ్బంది, గుడ్ ల్యాంప్ సిబ్బంది, ఎన్‌జీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు

భీమవరం: ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న తాజా సాంకేతికత, సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచుకోడానికి స్మార్ట్ సస్టైనబుల్ ఎనర్జీ సిస్టమ్స్ అంతర్జాతీయ సదస్సు ఎంతగానో దోహదం చేస్తుందని భీమవరం విష్ణు ఇంజినీరింగ్ ప్రిన్సిపల్ మంగం వేణు అన్నారు. కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. కార్యక్రమంలో కాంచీపురం ట్రిపుల్ ఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ బి చిట్టిబాబు, కళాశాల డైరెక్టర్ దశిక సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన

వీరవాసరం: ప్రతి ఉద్యోగి, విద్యార్థి లైంగిక వేధింపుల నిరోధక చట్టం పై అవగాహన కలిగి ఉండాలని, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని న్యాయవాదులు కేవీ రమేష్, సి.జ్వాలా శ్రీనివాస్ తెలిపారు. శనివారం వీరవాసరం శ్రీ మద్దాల బులి తాతయ్య నర్సమంబ డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి, పలు అంశాలపై అవగాహన కల్పించారు.

దండగర్ర విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలు అందుకున్న దండగర్ర జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ స్థాయి పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలో మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 11మంది ప్రతిభకనబర్చి, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం స్కూల్ ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్. చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర పర్యాటక, అటవీ మంత్రిత్వ శాఖ, జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీ నిర్వహించినట్లు తెలిపారు. కే.నాగగంగ, ఎం.రోహిత, ఎస్. లక్ష్మీవైష్ణవి, ఎ.వెంకన్నబాబు, ఎ.మానస (5వ తరగతి), ఎం.మధుప్రియ, ఎం.జ్యోత్స్న నాగవెంకటలక్ష్మి (6వ తరగతి), జి.ప్రశాంత్, ఆర్.సమత (7వ తరగతి), ఎ.సత్యదుర్గ (8వ తరగతి), వి.జ్యోతి వైష్ణవి (9వ తరగతి)లు ప్రశంసా పత్రాలు అందుకున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం చంద్రశేఖర్, తెలుగు ఉపాధ్యాయుడు వానపల్లి బద్రీనారాయణ, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

వైభవంగా సత్తెమ్మ జాతర ప్రారంభం



జాతర సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

ఉండి: పెదపుల్లేరు సత్తెమ్మ అమ్మవారి 59వ జాతర మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామ పొలిమేర నుంచి గరగన్రుత్యాలు, బుట్టబొమ్మలు, విచిత్ర వేషధారణ, బాణసంచా కాల్పులతో అమ్మవారిని ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు జరిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఉండి, ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు, భీమవరం, కైకలూరు తదితర మండలాల నుంచి ఏటా వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. దీనిలో భాగంగానే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఆలయ ఆవరణలో చలువ పందిర్లు వేసి మంచినీటి వసతిని కల్పించారు. ఈ జాతర మహోత్సవాలు ఈనెల 25వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. 26వ తేదీ ఉదయం 11 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో వేలాది మంది భక్తులకు అఖండ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కలిదిండి రామకృష్ణంరాజు, భాస్కరరాజు, సుబ్రహ్మణ్యంరాజు, శ్రీనువాసరాజు, కృష్ణానందవర్మ, నర్సింహరాజు, మురళీకృష్ణంరాజు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉత్సాహంగా హ్యాకథాన్ పోటీలు

భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రజ్వలన 2కె24 పేరిట రెండు రోజులపాటు నిర్వహించిన హ్యాక్తాన్ పోటీల్లో చెన్నైలోని సెయింట్ జోసెఫ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని పోటీల కన్వీనర్ వి చంద్రశేఖర్ చెప్పారు. శనివారం కళాశాలలో విజేతలకు బహుమతులు అందజేసి వివరాలను వెల్లడించారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ద్వితీయ స్థానం, బెంగళూరుకు చెందిన ప్రెసిడెన్సీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. కార్యక్రమంలో ఎంఎస్ పవన్ కుమార్‌రాజు, కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపల్ కేవీమురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.